



VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 99 మంగళవారం 08 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-


# కార్యకర్తలే పార్టీకి బలం..

## వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని
- అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి



# సెప్టెంబర్ 19న కోదాడ

## మెగా జాబ్ మేళా

- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నిరంతర కృషి అవసరం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నిరుద్యోగం నేడు మన సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యావంతులైన యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల సమష్టి బాధ్యత అని పేర్కొన్నారు.

# డొనాల్డ్ ట్రంప్ మరో పోస్టు..

## ఆ రాష్ట్రం పేరునూ మార్చేస్తారా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలనానికి తెరతీశారు. యూఎస్ఏలోని న్యూమెక్సికో రాష్ట్రం పేరును న్యూ అమెరికాగా మార్చాలన్న ప్రతిపాదనకు అద్దం పట్టే ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ రాష్ట్రం పేరులోని మెక్సికో పదాన్ని కొట్టేసి అమెరికా పేరు రాసున్న మ్యాపును నెట్టింట పంచుకున్నారు.



# అణు సామర్థ్యంతో 'కాంగ్ కోన్' నౌక..

## రంగంలోకి దించిన ఉత్తర కొరియా!

- 'కాంగ్ కోన్' డిస్ట్రాయర్‌ను ప్రారంభించిన ఉత్తర కొరియా
- ఇది తమ అణు ప్రతిచర్య వ్యవస్థలో భాగమని ప్రకటించిన కిమ్
- నావికా దళాన్ని అణుశక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టీకరణ
- కుటుంబంతో కలిసి నౌకా ప్రారంభోత్సవంలో పాల్గొన్న కిమ్



# ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

- ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశం
- ఇప్పటికే 1,294 పోస్టులను భర్తీ చేసినట్టు మంత్రి వెల్లడి
- అర్హత: 10వ తరగతి, 25-45 ఏళ్ల వయసు, స్థానిక మహిళలు

# తాతా మధును బర్తరఫ్ చేయాలి, కేసీఆర్ క్షమాపణ చెప్పాలి



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన ట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాం గబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్ పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా

# శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్



ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# కుప్పంలో టీచర్ పై దాడిని తీవ్రంగా ఖండించిన విద్యాశాఖ..

చిత్తూరు జిల్లా కుప్పంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. గురుపూజోత్సవం రోజే, తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఒక ఉపాధ్యాయుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితుడు దేశానికి సేవ చేసిన ఒక మాజీ సైనిక హవల్దార్ కావడం గమనార్హం. ఈ ఘటనను పాఠశాల విద్యాశాఖ సుమోటోగా స్వీకరించి, నిందితులపై కఠినమైన క్రిమినల్ చర్యలకు ఆదేశించింది. ఇది స్పోర్ట్స్ కోటాలో నియమితులైన ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఒక వ్యవస్థీకృత బెదిరింపుల దందా అని అనుమానిస్తున్నామని అధికారులు తెలిపారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సెప్టెంబర్ 19న కోదాడ మెగా జాబ్ మేళా

నిరుద్యోగ సమస్య ఒక్కరోజులో లేదా ఒక్క జాబ్ మేళాతో పూర్తిగా పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. యువత విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతర, ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను నియామక సంస్థలతో నేరుగా అనుసంధానం చేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తన 32 ఏళ్ల ప్రజాజీవితంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా సాధ్యమైనంతమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేశానని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రయత్నాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 19వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కోదాడ పట్టణంలోని సి.సి. రెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని, అవసరమైన ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుందని తెలిపారు. 2025 అక్టోబర్‌లో నిర్వహించిన హుజూర్‌నగర్ మెగా జాబ్ మేళాకు దాదాపు 40 వేల మంది నమోదు చేసుకోగా, 20,463 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని గుర్తుచేశారు. వారిలో 2,041 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 1,533 మంది తదుపరి నియామకాల కోసం షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు. మొత్తం 3,574 మంది యువతకు ప్రత్యక్షంగా లేదా భవిష్యత్తులో ఉపాధి పొందే అవకాశం లభించిందన్నారు.కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి కన్వీనర్‌గా జాబ్ మేళా నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. నల్గొండ ఎంపీ కె. రఘువీర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, కోదాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి ఎర్నేని కుసుమ, వైస్ ఛైర్‌పర్సన్ మల్లేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోటేశ్వరరావుతోపాటు పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు.అభ్యర్థుల నమోదు, కంపెనీల భాగస్వామ్యం, ప్రచారం, ఇంటర్వ్యూ సదుపాయాలు, రవాణా, భద్రత, ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను కమిటీ సమన్వయం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమ తేదీ సమీపించే నాటికి మరికొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులను నిర్వహణ కమిటీలో చేర్చనున్నట్లు తెలిపారు. నిర్వహణ కమిటీ తొలి సమావేశం సెప్టెంబర్ 10న సాయంత్రం 5 గంటలకు సచివాలయంలో జరుగుతుందని వెల్లడించారు.

## అణు సామర్థ్యంతో 'కాంగ్ కోన్' నౌక.. రంగంలోకి దించిన ఉత్తర కొరియా!

ఉత్తర కొరియా తన నావికాదళాన్ని ఆధునికీకరించే ప్రణాళికల్లో భాగంగా మరో కీలక ముందడుగు వేసింది. అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యంతో నిర్మించిన 'కాంగ్ కోన్' అనే కొత్త డిస్ట్రాయర్ (విధ్వంసక నౌక)ను నావికాదళంలోకి ప్రవేశపెట్టింది. దేశ తూర్పు తీరంలోని ఓడరేవు నగరం వోన్సాన్‌లో జరిగిన ఈ నౌక ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. 5,000 టన్నుల బరువున్న ఈ కొత్త డిస్ట్రాయర్ కేవలం రక్షణ కోసమే కాదని, ఇది శత్రువులపై దాడి చేయగల సామర్థ్యం ఉన్న నౌక అని స్పష్టం చేశారు. "ఈ నౌక దేశ అణు ప్రతిచర్య వ్యవస్థలో ఒక భాగం. శత్రువుల నుంచి ముప్పు ఎదురైతే వారికి చావుదెబ్బ రుచిచూపించేలా ఇది ప్రతిదాడి చేస్తుంది" అని కిమ్ హెచ్చరించారు. దేశ నావికాదళాన్ని పూర్తిగా "అణు సాయుధ శక్తి"గా మార్చడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. నావికాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఒక ముఖ్యమైన ప్రణాళికను అమలు చేస్తున్నామని, దాని ఫలితాన్ని ఎనిమిది నెలల్లో ప్రపంచానికి చూపిస్తానని కిమ్ ప్రకటించారు. ఇది 2021లో ఉత్తర కొరియా ప్రకటించిన అణు జలాంతర్గాముల నిర్మాణానికి సంబంధించినది కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నూతన 'కాంగ్ కోన్' నౌకను ఉత్తర కొరియా నావికాదళంలోని ఈస్ట్ సీ ఫ్లీట్‌లో మోహరించనున్నట్లు అధికారిక మీడియా కేసీఎన్ఏ తెలిపింది. మూడు నెలల క్రితమే 'చోయ్ హ్యోన్' అనే ఇదే తరహా డిస్ట్రాయర్‌ను పశ్చిమ సముద్రంలో మోహరించిన ఉత్తర కొరియా, ఇప్పుడు 'కాంగ్ కోన్'ను తూర్పు సముద్రంలోకి దించడం ద్వారా తన రెండు తీరాల్లో అణు సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. ఈ కార్యక్రమానికి కిమ్ తన భార్య రి సోల్ జు, కుమార్తె జు ఏతో కలిసి హాజరయ్యారు. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలు 'ఫ్రీడమ్ ఎడ్జ్' పేరుతో సైనిక విన్యాసాలు ప్రారంభించిన రోజే ఉత్తర కొరియా ఈ నౌకను ప్రారంభించడం గమనార్హం. ఈ విన్యాసాలు యుద్ధ సన్నాహక చర్యలేనని ఉత్తర కొరియా ఆరోపిస్తోంది. సెప్టెంబర్ 9న ఉత్తర కొరియా 78వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకోనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

# కార్యకర్తలే పార్టీకి బలం.. వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు.

# ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తాజాగా మరో 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

# కుప్పంలో టీచర్ పై దాడిని తీవ్రంగా ఖండించిన విద్యాశాఖ..

వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున కుప్పంలోని ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. మాజీ సైనికుడైన ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు చెబుతుండగా, ఇద్దరు వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. తాము మీడియా ప్రతినిధులమని చెబుతూ, ఉపాధ్యాయుడి మిలిటరీ గుర్తింపు కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు చూపించాలంటూ దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థుల ముందే అవమానకరంగా మాట్లాడారు. తన వ్యక్తిగత పత్రాలు అడిగే అధికారం మీకెక్కడిదని ఉపాధ్యాయుడు ప్రశ్నించడంతో, వారు రెచ్చిపోయి ఆయన కాలర్ పట్టుకుని గొడవకు పాల్పడ్డారు. విచారణలో ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని తేలింది. ఘటనకు రెండు రోజుల ముందు, అంటే సెప్టెంబర్ 3న, నిందితులు ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి 20 నిమిషాల పాటు మాట్లాడారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఆయనపై తప్పుడు వార్తలు ప్రచురిస్తామని బెదిరించారు. ఈ ఘటనతో ఉపాధ్యాయుడు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ అమానుష ఘటనపై పాఠశాల విద్యాశాఖ వెంటనే స్పందించి, స్థానిక పోలీసుల సమన్వయంతో క్రిమినల్ కేసు నమోదు చేయించింది. పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి, మీడియా ప్రతినిధులమని చెప్పుకుంటున్న శ్రీకాంత్ (సాక్షి రిపోర్టర్), గణేశ్ (సాక్షి కెమెరామెన్) అనే ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. "ఇది చాలా బాధాకరమైన సంఘటన. దేశానికి సేవ చేసి, ఇప్పుడు ఉపాధ్యాయుడిగా గౌరవప్రదమైన వృత్తిని స్వీకరించిన ఒక మాజీ సైనికుడి పట్ల ఇలా ప్రవర్తించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని తమీమ్ అన్సారియా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన 372 మంది ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె తెలిపారు.

# శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

# తాతా మధును బర్తరఫ్ చేయాలి, కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# డొనాల్డ్ ట్రంప్ మరో పోస్టు.. ఆ రాష్ట్రం పేరునూ మార్చేస్తారా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలనానికి తెరతీశారు. యూఎస్ఏలోని న్యూమెక్సికో రాష్ట్రం పేరును న్యూ అమెరికాగా మార్చాలన్న ప్రతిపాదనకు అద్దం పట్టే ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ రాష్ట్రం పేరులోని మెక్సికో పదాన్ని కొట్టేసి అమెరికా పేరు రాసున్న మ్యాపును నెట్టింట పంచుకున్నారు. దీంతో, ఈ అంశం ప్రస్తుతం నెట్టింట ట్రెండింగ్ లోకి వచ్చేసింది. ఇటీవల కాలంలో ట్రంప్ గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా పేరు మార్చిన విషయం తెలిసిందే. కెనడా సరిహద్దు వద్ద ఉన్న మరో సరస్సుకు కూడా లేక్ అమెరికా అని పేరు మార్చే ప్రయత్నం చేశారు. అంతకుముందు, హోర్ముజ్ జలసంధిని ట్రంప్ స్ట్రెయిట్‌గా పిలిస్తే బాగుందని అన్నారు. ఈ నేపథ్యంలోనే యూఎస్‌లోని న్యూమెక్సికో రాష్ట్రం పేరు మార్పు అంశం సెటైరికల్‌గా తెరపైకి వచ్చింది. న్యూమెక్సికో పేరును న్యూ అమెరికాగా మార్చేస్తే పోలా అని ట్రంప్‌ను ట్యాగ్ చేస్తూ అనేక మంది కామెంట్ చేశారు. ఈ ట్రెండ్‌పై ట్రంప్ తాజాగా నెట్టింట స్పందించారు. ఐడియా తనకు బాగా నచ్చిందన్నట్టు రాష్ట్రం పేరును కొట్టేసి ఉన్న మ్యాపును షేర్ చేశారు. ఇదే మ్యాపును శ్వేత సౌధం కూడా రీపోస్టు చేసింది. ఈ పోస్టుపై న్యూమెక్సికోలో ఇప్పటికే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ రాష్ట్ర గవర్నర్, ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ నేత మిషెల్ గ్రీషమ్ ఘాటుగా స్పందించారు. ఇరాన్ యుద్ధం నుంచి, దేశీయంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ట్రంప్ ఇలా చేశారని ఆరోపించారు. అసలు ఈ అంశంపై చర్చే అనసరమని తేల్చి చెప్పారు. మ్యాపులకు రంగులేస్తూ శ్వేతసౌధం సమయం వృథా చేస్తుంటే తాము మాత్రం ప్రజల కోసం పని చేస్తున్నామని చెప్పారు. ఇక అమెరికాలోని రాష్ట్రాల పేర్లను మార్చే అధికారం అధ్యక్షుడికి ఉండదని అక్కడి రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# సంపాదకీయం

## హిందీ సాహిత్యంలో తెలుగు తేజం!




గాంధీజీ ప్రోత్సహించిన 'హిందీ ప్రచార ఉద్యమం' ద్వారా దక్షిణ భారతదేశంలో హిందీ ప్రచారం బహుముఖంగా విలసిల్లింది. దాని ఫలితంగా దక్షిణ భారతదేశంలోని ఎందరో హిందీ సాహిత్య రంగంలో తమ ప్రతిభను వెల్లడించారు. సర్వశ్రీ వారణాశి రామమూర్తి రేణు, ఆలూరి బైరాగి, అరిగపూడి రమేశ్ చౌదరి, ఆచార్య సుందరరెడ్డి, డా. పి.ఆదేశ్వరరావు, బాలశౌరిరెడ్డి, డా. కర్ణరాజ శేషగిరిరావు, డా. భీమ్‌సేన్ నిర్మల్, సూర్యనారాయణ భాను, పుల్లయ్యరావు... ఇలా హిందీ సాహిత్యంలో వివిధ ప్రక్రియలలో తమ ప్రతిభను వెల్లడించిన తెలుగువారు ఎందరో ఉన్నారు, కానీ డా. ఆదేశ్వరరావు వలె అన్ని ప్రక్రియలలోనూ ప్రతిభను విస్తరింపజేసినవారు చాలా అరుదు. ఆదేశ్వరరావు 1936లో గుంటూరులో ఒక విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు హైస్కూల్‌లో ప్రముఖ హిందీ, తెలుగు కవి ఆలూరి బైరాగి వద్ద హిందీ అధ్యయనం చేశారు. బైరాగి ప్రభావంతో తన 18వ ఏట నుంచే ఆయన కవితా వ్యాసంగాన్ని ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ హిందీ పత్రికలైన 'స్రవంతి', 'దక్షిణ భారత్'లలో ఆయన కవితలు వెలువడ్డాయి. 1955లో గుంటూరు హిందూ కళాశాల నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఏ పట్టాను పొంది బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో హిందీ ప్రధానంగా ఎం.ఏ చదువును ప్రారంభించారు. అక్కడ ప్రముఖ హిందీ సాహిత్యవేత్తలు, పండితుల శిష్యరికంలో ఆయనలోని ప్రతిభ పూర్ణ వికాసం పొందింది. 1965లో 'హిందీ ఔర్ తెలుగుకే స్వచ్ఛందతావాది కావ్యధారాకే తులనాత్మక అధ్యయన్' అన్న పరిశోధనా గ్రంథంపై ఈయనకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ బృహత్ గ్రంథంలో ఆయన హిందీ, తెలుగు భావ కవిత్వంలోని సమాన--అసమానతలను సోదాహరణంగా వివరించారు. ఈ గ్రంథం ద్వారా హిందీ తులనాత్మక విమర్శకులలో అగ్రతాంబూలం అందుకున్న అయిదుగురిలో ఆదేశ్వరరావు ఒక స్థానాన్ని పొందారని ఢిల్లీ విశ్వవిద్యాలయ ఆచార్యులు శీతాంశు కీర్తించారు. ఆ తరువాత మద్రాసులోని 'దక్షిణ భారత హిందీ ప్రచార సభ' పోస్టు గ్రాడ్యుయేటు శాఖలో అయిదేళ్లు లెక్చరర్‌గా పనిచేసి, ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగంలో ఆచార్యుడిగాను, విభాగాధిపతిగాను పనిచేశారు. 2020 సెప్టెంబర్ 9న స్వర్గస్థులయ్యే వరకు ఆయన కవిగా, విమర్శకుడిగా--భాషా తత్వవేత్తగా, అనువాదకుడిగా, హిందీ సాహిత్య రంగంలో తనకొక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆదేశ్వరరావు 1969లో 'అంతరాల్' అనే కవితా సంపుటిని వెలువరించారు. దానిలో ఆయన 1957 నుంచి 1965 వరకూ రాసిన కవితలు ఉన్నాయి. ఈ కవితా సంపుటి 1971లో భారత ప్రభుత్వ ఉత్తమ సృజనాత్మక గ్రంథంగా బహుమతి పొందింది. ఇందులో కవిగా ఆయన... కొన్నిచోట్ల ఆదర్శ ప్రేమికుడిగా ప్రేయసితో ఊహాలోకాలలో విహరిస్తూ, మరికొన్నిచోట్ల భగ్న ప్రేమికుడిగా విరహ వేదనను అనుభవిస్తూ దర్శనమిస్తాడు. ఒకచోట ప్రేయసిని "బినా తెరే రూప్ దేఖే, దేవి కైసే జీ సకూం మై?" అంటాడు. 'పంఖ్ లగాదో ప్రాణోంమే' అనే కవితలో తన బాహువులకే రెక్కలు వస్తే ప్రేయసిని హృదయంలో దాచుకుని, వినీల ఆకాశంలోకి ఎగిరిపోవాలని ఆకాంక్షిస్తాడు. కొన్ని తత్వ ప్రధానమైన కవితలు కూడా ఇందులో కనపడతాయి. సాహితీ విమర్శకుడిగా కూడా ఆయనకు హిందీ సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉన్నది. ఆయన రాసిన విమర్శనాత్మక గ్రంథాలలో పైన చెప్పిన పరిశోధనా గ్రంథంతోపాటు, 'కవి పంత్ ఔర్ ఉన్‌కి ఛాయావాదీ రచనాయే', 'తులనాత్మక్ శోధ్ ఔర్ సమీక్షా' ముఖ్యమైనవి. 'కవి పంత్ ఔర్ ఉన్‌కీ ఛాయావాదీ రచనాయే' గ్రంథంలో మహాకవి సుమిత్రానందన్ పంత్ రచనలలోని భావ రమణీయతను, కల్పనా ప్రాభవాన్ని, శైలిలోని సొబగును విమర్శనాత్మకంగా వివరించారు. 'తులనాత్మక్ శోధ్ ఔర్ సమీక్షా' ఈయన పరిశోధనా వ్యాసాల సంగ్రహం. అనువాదకుడిగా కూడా ఆదేశ్వరరావు హిందీ, తెలుగు, ఇంగ్లీషు భాషలపై తనకున్న అధికారాన్ని, ఆయా భాషల సాహిత్యాల్లో తనకున్న పాండితీ ప్రకర్షను నిరూపించుకున్నాడు. ఆయన తెలుగు నుంచి హిందీలోకి చేసిన అనువాదాల్లో బుచ్చిబాబు 'ఆత్మవంచన', త్రిపురనేని రామస్వామి చౌదరి 'ఖూనీ' అనే నాటకాలు, కోనేరు రామకృష్ణారావు 'చంపక' అనే గేయ నాటిక; ప్రఖ్యాత తెలుగు కవులైన అడివి బాపిరాజు, రాయప్రోలు సుబ్బారావు, కరుణశ్రీ, గురజాడ, శ్రీశ్రీ, బైరాగి, నారాయణబాబు, పట్టాభి, తిలక్, సోమసుందర్, దాశరథి, ఆరుద్ర, సినారె మొదలైనవారి కవితలు; పైడిపల్లి రవీంద్రబాబు, అద్దేపల్లి రామమోహనరావు, బలిజేపల్లి రాఘవరావు మొదలగువారి కథలు ముఖ్యమైనవి. జ్ఞానపీఠ్ బహుమతి పొందిన రామధారిసింహ్ దినకర్ మహోన్నత కావ్యసృష్టి 'ఊర్వశి'ని ఆదేశ్వరరావు ఇంగ్లీషులోకి అనువదించారు. ఇది ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ఇండియన్ హెరాల్డ్'లో ధారావాహికగా వచ్చింది. ఇవి మాత్రమేగాక బెంగాలీ కవి బుద్ధదేబ్ బసు 'కాలసంధ్య' గేయ నాటికను తెలుగులోకి అనువదించారు. ఇది 1968లో ఆకాశవాణి మద్రాసు కేంద్రం నుంచి ప్రసారమైంది. 1979లో ఆదేశ్వరరావు హిందీ సాహిత్యానికి చేసిన ఎనలేని సేవలను గుర్తించి అఖిల భారతీయ హిందీ ప్రసార ప్రతిష్ఠాన్, పాట్నా వారు 'సాహిత్యమణి' గౌరవ పట్టా ఇచ్చి సత్కరించారు.

# సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**-ట్రాన్సపోర్టు వర్కర్స్ యూనియన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్**

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో మోటార్ ట్రాన్స పోర్టు వర్కర్స్ యూనియన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట యూనియన అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో కార్మికుల కు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ట్రాఫిక్ చలానా పేరుతో కార్మికులపై భారం అవుతున్న జీవో 2131 రద్దు చేయాలన్నారు. స్వయం ఉపా ధితో వాహనాలు కొనుగోలు చేసే కార్మికు లకు వడ్డీలేని బ్యాంకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ఆటో కార్మికుల పిల్లలకు ఉచిత చదువు, ఇళ్లు లేని వారికి ఇంటి స్థలం ఇప్పించాలని, పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నక్కి లెనిన బాబు, యూనియన జిల్లా నాయకులు గణేష్, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు జి.చంద్రశేఖర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రామాంజనేయులు, ఆర్. కృష్ణా రెడ్డి, నాగరాజు, అబ్బాస్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.




## ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

**-నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం



ప్రజల ఫిర్యా దుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని నగర పాలక సంస్థ కమిష నర్ చల్లా ఓబులేసు అన్నారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మానికి ప్రజల నుంచి 18 అర్జీలు ఆయన స్వీక రించారు. కమిషనర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య ప్రాంతాన్ని సందర్శిం చినప్పుడు సమస్యను పూర్తిగా గ్రహించి, పరిష్కా రం కనుగొనడం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఈ జే.ర మణమూర్తి, ప్రజారోగ్య అధికారి డా.ఎం.రఘు, డీసీపీ షబ్నమ్ శాని?త్ర, ఏసీపీ నాగరాజు, మేనేజర్ జునైద్, కార్యదర్శి నాగరాజు, వాజిద్, సర్వేయర్ మద్దిలేటి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

## 12న జాతీయ లోక్ అదాలత్



కర్నూలు లీగల్, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) పి. వాసు న్యాయాధికారులకు సూచించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీకి అర్హత కలిగిన క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, ఫ్యామిలీ కేసులతో సహా పలు రకాల కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారని తెలిపారు

# కుటుంబ సభ్యులే వేధిస్తున్నారు

**-పీజీఆర్ఎస్‌లో బాధితురాలి ఫిర్యాదు**

**-మొత్తం 104 అర్జీలు : ఎస్పీ విక్రాంత్ పాటిల్**

కర్నూలు క్రైం, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

భర్త మృతి చెందిన తర్వాత కుటుంబ సభ్యులు తనను వేధిస్తున్నారంటూ కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి చెందిన విజయలక్ష్మి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. భర్త తరపున ఆస్తిలో తనకు రావాల్సిన వాటా ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. పొలంలో వరినాట్లు వేయకుండా అడ్డుకుంటున్నారని, తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోల?సస్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులను ఎస్పీ నేరుగా స్వీకరించారు. రుణాలు, ఉద్యోగాలు, నాన్ రీఫండబుల్ ఫండ్ కింద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేయిస్తామని దళిత శక్తి ఫౌండేషన్ పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని కొందరు మోసాలకు పాల్పడ్డారని స్టాంటన్‌పురానికి చెందిన మన్సూర్ అహ్మద్ ఫిర్యాదు చేశారు. విశాఖపట్నం, నెల్లూరు జిల్లాలో పోర్టు ఏరియాలలో తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు శ్రీరామ్ నగర్‌కు చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. రస్తా ఇవ్వకుండా తన అన్న సుంకన్న ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ, అతనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని క్రిష్ణగిరి మండలం ఆగవెల్లి గ్రామానికి చెందిన పరమేష్ ఫిర్యాదు చేశారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జెస్కాంలోని ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఫోర్జరీ సంతకాలతో మోసం చేసి రూ.5లక్షలు తీసుకున్న ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోసిగి చెందిన బాధితుడు ఎస్పీని ఆశ్రయించాడు. కర్నూలు రూరల్ దిగువపాడు చెందిన కొందరు వ్యక్తులు ఫోన్ కాల్స్ చేసి రూ.లక్ష ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారనీ షర?ఫనగర్ చెందిన సాయికుమార్ ఫిర్యాదు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. మొత్తం 104 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, ఇస్మాయిల్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.



# రహదారులపై గుంతలు పూడ్చివేతకు 'డాక్టర్'

**-రూ.1.3 కోట్లతో అత్యాధునిక యంత్రం కొనుగోలు చేసిన జీవీఎంసీ**

**-రోజుకి 300 చదరపు మీటర్లు ప్యాచ్‌వర్క్ చేసే సామర్థ్యం**

విశాఖపట్నం, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం



నగరంలోని రహదారులపై గుంతలు (పాట్ హోల్స్) పూడ్చివేతకు జీవీఎంసీ ప్రత్యేక యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చింది. 'బీటీ పాట్‌హోల్ డాక్టర్'గా పిలవబడే ఈ అత్యాధునిక యంత్రం ఖరీదు రూ. 1.3 కోట్లు. ఆ యంత్రంతో సోమవారం రామ్‌నగర్‌లో కేర్ ఆస్పత్రి సమీపాన రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా యంత్రం పనితీరును జీవీఎంసీ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. రోడ్లపై పడిన గుంతలను శుభ్రం చేయడం, అవసరమైన బిటుమెన్ (బీటీ) మిశ్రమాన్ని గుంతలో నింపడం, ప్యాచ్ వర్క్‌ను రోలింగ్ చేయడం...అన్నీ అదే యంత్రం చేయడం చూసి వారిద్దరూ సంతృప్తి వ్యక్తంచేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఈ యంత్రంతో రోజుకు 300 చదరపు మీటర్లు గుంతలను కప్పవచ్చునని మెకానికల్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాయల్‌బాబు వివరించారు. యంత్రం సరఫరా చేసిన సంస్థే మూడేళ్లపాటు నిర్వహణ, ఆపరేషన్ బాధ్యతలను చూస్తుందని, రోడ్డుపై పడిన గుంత పరిమాణం బట్ట మరమ్మతుకు పది నుంచి 15 నిమిషాలు తీసుకుంటుందన్నారు. ఈ యంత్రంతో గుంతలను పూర్తి రహదారులను చక్కగా తీర్చిదిద్దుతామని ఆశాభావం వ్యక్తంచేశారు.

# రాష్ట్ర ఆర్థిక సంఘానికిపటిష్ఠ డేటా వ్యవస్థ

**-గ్రామ పంచాయతీల ఆర్థిక బలోపేతానికి కేంద్రం కొత్త కార్యాచరణడేటా కొరతతో ఎస్ఎఫ్సీల పనితీరుపై ప్రభావం**
**-సమగ్ర డేటాబేస్ ఏర్పాటుకు సిఫారసులు**
**-ప్రతి రాష్ట్రంలోనూ ఎస్ఎఫ్సీ సెల్**
**-గ్రామ పంచాయతీ స్థాయి వరకు ఆర్థిక, సామాజిక సమాచారం అందుబాటులోకి**
**-తద్వారా సమర్థవంతంగా నిధుల పంపిణీ**

అమరావతి సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

గ్రామ పంచాయతీలకు నిధుల పంపిణీ, ఆర్థిక వికేంద్రీకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలంటే రాష్ట్రాల ఆర్థిక సంఘాల (ఎస్ఎఫ్సీ) వద్ద కచ్చితమైన సమగ్ర డేటా అందుబాటులో ఉండాలని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రాల ఆర్థిక సంఘాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డేటా కొరతేనని గుర్తించిన కేంద్రం.. ఈ లోటును అధిగమించేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, రూపొందించిన నివేదికను తాజాగా విడుదల చేసింది. గ్రామ పంచాయతీల ఆదాయం, వ్యయం, ఆస్తులు, సేవల అందుబాటు, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఒకే వేదికపై అందుబాటులో ఉంటేనే.. నిధుల పంపిణీ శాస్త్రీయంగా జరిగే అవకాశం ఉంటుందని కమిటీ పేర్కొంది. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు డేటా సేకరణ, ప్రామాణీకరణ, డిజిటల్ నిర్వహణకు సంబంధించి నివేదికలో పలు కీలక సిఫారసులు చేసింది.

**-ఆర్థిక సంఘాల పనితీరులో లోపాలు**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-1 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకోసారి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి. ఈ సంఘం గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లా పరిషత్‌ల ఆర్థిక పరిస్థితిని సమీక్షించి.. రాష్ట్ర పన్నుల వాటా, గ్రాంట్లు, ఇతర ఆర్థిక వనరుల పంపిణీపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. వీటి ఆధారంగానే స్థానిక సంస్థలకు ఆర్థిక బలం చేకూరుతుంది. ఆర్థిక సంఘాల పనితీరును పరిశీలించిన కమిటీ పలు తీవ్ర లోపాలను గుర్తించింది. పంచాయతీల ఆర్థిక లెక్కలను ఒకేవిధంగా నిర్వహించకపోవడం, శాఖల వారీగా డేటా సరిగా లేకపోవడం, గ్రామ పంచాయతీ స్థాయిలో సమాచారం అందుబాటులో లేకపోవడం, ఆదాయం, వ్యయం, ఆస్తులపై సమగ్ర డేటాబేస్ లేకపోవడం, శిక్షణ పొందిన అకౌంటెంట్లు, డేటా నిర్వహణ సిబ్బంది కొరత, పనితీరు ఆధారిత నిధుల పంపిణీకి అవసరమైన వివరాలు లేకపోవడం, రాష్ట్ర ఆర్థిక సంఘాల నివేదికలను ఆలస్యంగా సమర్పి ంచడం, రాష్ట్రాల మధ్య నివేదికల్లో నాణ్యత, విధానం లో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నట్లు నివేదించింది.



**-ఏ సమాచారం సేకరించాలంటే!**

కమిటీ నివేదిక ప్రకారం..

ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి మొత్తం జనాభా, మహిళలు, ఎస్సీ, ఎస్టీ జనాభా, సామాజిక వర్గాల వివరాలు, పేదరికం, అక్షరాస్యత, ఆరోగ్య పరిస్థితి, వెనుకబడిన ప్రాంతాల సమాచారం, పన్నుల ఆదాయం, పన్నేతర ఆదాయం వివరాలు సేకరించాలి. ఇంకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు, కేంద్ర నిధులు, అప్పులు, మూలధన వ్యయం, నిర్వహణ ఖర్చులు, పెండింగ్ బకాయిలు, గ్రామ ఆస్తులకు సంబంధించి పంచాయతీ భవనాలు, చెరువులు, రహదారులు, తాగునీటి వసతులు, వీధి దీపాలు, పారిశుధ్య సదుపాయాలు, శ్మశానాలు, ఇతర ప్రజా ఆస్తులు, సేవలకు సంబంధించి తాగునీటి సరఫరా, పారిశుధ్యం, మౌలిక వసతులు, మహిళా సంఘాలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, ఉపాధి హామీ పనులు, పంచాయతీ అభివృద్ధి సూచిక వివరాలూ తీసుకోవాలి. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక సంఘాలు ఈ-గ్రామస్వరాజ్, పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ2.0), జనాభా లెక్కలు, ఎస్ఈసీసీ, కాగ్ ఆడిట్ నివేదికలు, ఆడిట్ ఆన్‌లైన్, రాష్ట్ర బడ్జెట్ పత్రాలు తదితర వనరుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నాయని కమిటీ తెలిపింది. అయితే ఈ డేటా పంచాయతీ స్థాయిలో అందుబాటులో లేకపోవడం వల్ల విశ్లేషణ కష్టమవుతోందని నివేదిక పేర్కొంది.

**-కీలకమైన 15 ప్రధాన సిఫారసులు**

కమిటీ 15 ప్రధాన సిఫారసులు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆర్థిక సమాచారం సంవత్సరాల వారీగా భద్రపరిచేందుకు పంచాయతీ స్థాయిలో శాశ్వత ఆర్థిక డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలి. ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్సీ) సెల్ ఏర్పాటు చేసి, డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. దేశవ్యాప్తంగా స్థానిక సంస్థలకు నిధుల బదిలీని ఒకే అకౌంటింగ్ హెడ్‌ల కింద నమోదు చేసి, ఒకే అకౌంటింగ్ విధానం తీసుకురావాలి. రాష్ట్ర బడ్జెట్‌లో గ్రామ పంచాయతీ వారీగా ఎంత నిధులు ఇచ్చారో ప్రత్యేక పత్రంగా ప్రచురించాలి. ఈ-గ్రామ స్వరాజ్ సహా అందుబాటులో ఉన్న అన్నీ డేటా వనరుల వినియోగంపై ఆర్థిక సంఘాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. 73వ రాజ్యాంగ సవరణ అమలుపై కాగ్ ద్వారా ప్రత్యేక పనితీరు ఆడిట్ నిర్వహించాలి. రాష్ట్ర ఆర్థిక సంఘాలకు శిక్షణ, ఉత్తమ పద్ధతుల రూపకల్పన బాధ్యతలను జాతీయ స్థాయి సంస్థలు ఎన్ఐఆర్డీపీఆర్‌కు అప్పగించాలని సూచించింది. గతంలో నిలిచిపోయిన పంచాయతీ గణాంకాల ప్రచురణను మళ్లీ ప్రారంభించాలని, జిల్లా, మండల, గ్రామ పంచాయతీ స్థాయిలో అందుబాటులో ఉన్న అన్నీ డేటా వనరులను ఒకే హ్యాండ్‌బుక్‌లో తీసుకురావాలి. భవిష్యత్తులో అన్ని రాష్ట్రాలు అనుసరించేలా సమగ్ర ఎస్ఎఫ్సీ మాన్యువల్ రూపొందించాలని కమిటీ ప్రతిపాదించింది.

**-సిఫారసులు అమలైతే ప్రయోజనం**

ఈ సిఫారసులు అమలైతే పంచాయతీల ఆర్థిక స్థితిపై కచ్చిత సమాచారం అందుబాటులోకి వస్తుంది. నిధుల పంపిణీ పారదర్శకంగా మారుతుంది. రాష్ట్రాల మధ్య పోలికలు సులభమవుతాయి. పంచాయతీల పనితీరు ఆధారంగా నిధుల కేటాయింపునకు అవకాశం ఏర్పడుతుంది. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను మరింత సమర్థంగా అంచనా వేయవచ్చని కమిటీ అభిప్రాయపడింది. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో ఏర్పాటు కానున్న తదుపరి రాష్ట్ర ఆర్థిక సంఘానికి ఈ నివేదిక మార్గదర్శకంగా నిలిచే అవకాశముంది. ముఖ్యంగా ఈ-గ్రామస్వరాజ్, పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ 2.0), పంచాయతీ వారీ ఆర్థిక డేటాబేస్, పంచాయతీ స్థాయి నిధుల ట్రాకింగ్, రాష్ట్ర బడ్జెట్‌లో గ్రామ పంచాయతీ వారీ నిధులు వెల్లడించడం వంటి అంశాలు అమల్లోకి వస్తే గ్రామీణ స్థానిక సంస్థలకు నిధుల పంపిణీ మరింత పారదర్శకంగా, శాస్త్రీయంగా మారే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.

# ఏలేరు కాలువలోకి గోదావరి జలాలు

**-తాళ్లపాలెం వద్ద పోలవరం కాలువ నుంచి అనుసంధానం**

అనకాపల్లి/కశింకోటం, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం



పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి విడుదలైన గోదావరి జలాలు ఎట్టకేలకు ఏలేరు కాలువలోకి ప్రవేశించాయి. అధికారులు సోమవారం తాళ్లపాలెం వద్ద గోదావరి జలాలను ఏలేరు కాలువలోకి అనుస ంధానం చేశారు. దీని నుంచి గోదావరి జలాలు విశాఖకు వెళతాయి. పాయకరావుపేట నుంచి తాళ్ల పాలెం వరకు సుమారు 52 కిలోమీటర్ల మేర కాలువలో నీటి ప్రవాహాన్ని నాలుగు రోజులపాటు పరిశీలించిన అనంతరం సోమవారం ఏలేరు కాలువలోకి నీటిని మళ్లించినట్లు పోలవరం ప్రాజెక్టు డీఈ డి.భాస్కర్ రామకృష్ణ తెలిపారు. తాళ్లపాలెం వద్ద పోలవరం కాలువ, ఏలేరు కాలువ భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా అంచెలు అంచెలుగా నీటిని వదులుతున్నట్టు చెప్పారు. పోలవరం ఎడమ కాలువను ఏలేరు కాలువకు అనుస ంధానం చేయడంతో ఏలేరు రిజర్వాయర్ నుంచి కాలువకు నీటి విడుదలను క్రమబద్ధీకరించినట్టు డీఈ వెల్లడిం చారు. కాలువకు ఇంకా సిమెంట్ లైనింగ్ జరగని ప్రదేశాల్లో గట్ల నుంచి లీకేజీలు, గట్లు కోతకు గురై గండిపడడం వంటి వాటికి ఆస్కారం లేకుండా తమ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

**-పోలవరం కాలువలోకి దిగొద్దు**

పోలవరం ఎడమ ప్రధాన కాలువలో నీటి ప్రవాహం అధికంగా వున్నందున ప్రజలెవరూ కాలువలోకి దిగొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. గోదావరి పవిత్ర జలాలు అన్న ఉద్దేశంతో పుణ్యస్నానాలు ఆచరించే ప్రయత్నం చేయొద్దని, అదే విధంగా ఈత కొట్టడం, సరదాగా కాలువలోకి దిగడం వంటి పనులు చేయొద్దని స్పష్టం చేశారు. గ్రామాల వద్ద కాలువ గట్టుపైకి చిన్నపిల్లలు వెళ్లకుండా తల్లిదం డ్రులు అప్రమత్తంగా వుండాలని సూచిస్తున్నారు. కాలువలో నీటి ప్రవాహం క్రమేపీ పెరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లో పశువులను సైతం కాలువలోకి దించవద్దని స్పష్టంచేశారు.

**-పోలవరం కాలువలో పెరిగిన నీటి ఉధృతి**

ఎలమంచిలి మండల పరిధిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువలో సోమవారం నీటి ఉధృతి పెరిగింది. చిన్నపాటి నది తరహాలో ప్రవహిస్తున్న పోలవరం కాలువను పలు గ్రామాల ప్రజలు ఆశ్చర్యంతోపాటు ఆనందంతో తిలకిస్తున్నారు. రెండు రోజుల క్రితం మూడు అడుగుల లోతున మాత్రమే ప్రవహించిన నీరు.. సోమవారం పది అడుగులకు పెరిగింది. కాలువ సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తే 15 అడుగులకుపైగా వుంటుందని అధికారులు చెబుతున్నారు. కాగా పోలవరం కాలువలో నీటి ప్రవాహం పెరిగిందని, అందువల్ల ప్రజలెవరూ కాలువలో దిగవద్దని, అదే విధంగా పశువులను కాలువలోకి వదలొద్దని ఎలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర హెచ్చరికలు జారీ చేశారు.

## స్థానిక సమరానికి టీడీపీ సై: 28 జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌లను ప్రకటించిన అధిష్ఠానం

**-అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఎమ్మెల్యేలకు బదులు సీనియర్లకు అప్పగింత**
**-మిత్రపక్షాలతో సమన్వయం, ప్రచారంపై ఇన్‌ఛార్జ్‌లకు కీలక బాధ్యతలు**
**-ఫలితాల్లో తేడా వస్తే ఒప్పుకోనని కుప్పం నేతలకు సీఎం చంద్రబాబు హెచ్చరిక**

సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సర్వసన్నద్ధమవుతోంది. ఈ దిశగా ఎన్నికల కసరత్తును వేగవంతం చేస్తూ, రాష్ట్రంలోని 28 జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఈసారి సరికొత్త వ్యూహాన్ని అనుసరించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**-జిల్లాలవారీ ఇన్‌ఛార్జ్‌లు, జిల్లా ఇన్‌ఛార్జ్**

పార్వతీపురం మన్యం -దాడి రత్నాకర్ , అల్లూరి సీతారామరాజు- పేరాబత్తుల రాజశేఖర్ , శ్రీకాకుళం -ఎండీ నజీర్ , విజయనగరం - ఎంపీ చింతకాయల విజయ్ , విశాఖపట్నం -ఏ షరీఫ్ , అనకాపల్లి - కొండపల్లి అప్పలనాయుడు , పోలవరం , కె సత్తిబాబు ,కాకినాడ - సుజయ్ కృష్ణరంగారావు , డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ - ఎంపీ సానా సతీష్ , తూర్పుగోదావరి - దేవినేని ఉమామహేశ్వరరావు , పశ్చిమగోదావరి -ఎంపీ భాష్యం రామకృష్ణ , ఏలూరు , ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ , కృష్ణా - కొమ్మాలపాటి శ్రీధర్ , ఎన్టీఆర్ - మక్కెన మల్లికార్జునరావు , గుంటూరు -ఎంపీ సత్యనారాయణరాజు, పల్నాడు - కొనకళ్ల నారాయణ , బాపట్ల - జంగా కృష్ణమూర్తి , ప్రకాశం -ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి , మార్కాపురం- ఎమ్మెల్సీ బీటీ నాయుడు , నెల్లూరు -ఎస్వీఎస్ఎన్ వర్మ , తిరుపతి - నూకసాని బాలాజీ , చిత్తూరు-దామచర్ల సత్య , కడప-దీపక్ రెడ్డి , అన్నమయ్య - ఎమ్మెల్సీ శ్రీకాంత్ , అనంతపురం- ఏరాసు ప్రతాప్‌రెడ్డి , శ్రీసత్యసాయి -సోమిశెట్టి వెంకటేశ్వర్లు , కర్నూలు - పెళ్లకూరు -శ్రీనివాసరెడ్డి , నంద్యాల- వైకుంఠం ప్రభాకర్ చౌదరి .

# సమస్య పరిష్కరించకనే



పిచ్చాటూరు, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

సమస్య పరిష్కరించకనే పరిష్కరించినట్లు సమాధానాలు ఇస్తారా అంటూ 70యేళ్ల వృద్ధురాలు ప్రజా వేదిక సమావేశంలో రెవెన్యూ అధికారుల ఎదుట తన ఆవేదన వ్యక్తం చేసింది. పిచ్చాటూరు మండలం అడవికొడ ియంబేడు గ్రామానికి చెందిన ఆర్.దమయంతికి సర్వే నెం.90-5లో 0.13 సెంట్ల పట్టా భూమి వుంది. దాని పక్కనే ఉన్న 20 సెంట్ల భూమికి పోయే దారికి అడ్డంగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, ఆర్టీసీ డ్రైవర్ డేవిడ్ రాజ్ గ్రామనత్తం భూమిలో ఇల్లు నిర్మించుకోవడంతో పాటు ప్రహరీ గోడ నిర్మించాడు. దీంతో తన స్థలానికి పోయే దారి కావాలంటూ దమయంతి 2024 జూన్ 13న నిర్వహించిన తొలి ప్రజావేదికతో పాటు 2024 జూలై 29న నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలు అందించారు. అలాగే మంత్రి నారా లోకేశ్ సత్యవేడు పర్యటనలో 2025 మే 8న వినతిపత్రం అందజేశారు. మండలంలో జరిగిన మూడు పీజీఆర్ఎస్‌లలో అర్జీ పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. అయితే సమస్య పరిష్కరించినట్లు, అందుకు అంగీకరించినట్లు దమయంతి సంతకం ఫోర్జరీ చేసి ఎండార్స్‌మెంట్ కాపీని అధికారులు అందించారు. మరోసారి 16 అడుగుల మేర దారి ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో సమాధానం ఇచ్చారు.ఇటీవల ఇంకో ఎండార్స్‌మెంట్ కాపీలో క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఆ భూమికి ఇదే దారి కాకుండా వేరే మార్గంలో కూడా దారి ఉందని సమాధానం ఇచ్చారు. సెప్టెంబరు 20 తరువాత గ్రామానికి వచ్చి క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కార మార్గం చూపుతామని చెప్పారు. ఇలా ఎన్ని రకాల సమాధానాలిస్తారని ఆమె వాపోయారు.

VARTHA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 08 సెప్టెంబర్ 2026

# వివాహేతర సంబంధమే కారణం

-పారిశుధ్య కార్మికురాలిపై దాడిలో ఆరుగురి అరెస్టు

-కర్నూలు ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య బాధితురాలు



ఆదోని, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

పట్టణంలో సంచలనం సృష్టించిన పారిశుధ్య కార్మికురాలిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులో పోలీసులు వేగంగా స్పందించారు. వివాహేతర సంబంధం కారణంగా హత్యాయత్నం జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదివారం ఆదోని టూటౌన్ పోల?సస్టేషన్‌లో డీఎస్పీ వెంకటరమణ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

-అసలేం జరిగింది..?

కంబాలదిన్నెకు చెందిన నరసమ్మ(26)కు శీనుతో వివాహం జరిగింది. ఐదేళ్ల క్రితం భర్త ఆత్మహత్య చేసుకోవడంతో ముగ్గురు పిల్లలతో ఒంటరిగా మిగిలింది. అనంతరం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా ఉద్యోగం వచ్చింది. ఆ సమయంలో ఐసీ చిన్న ఈరన్నతో ఆమెకు పరిచయం ఏర్పడి సహజీవనం కొనసాగించింది. ఇది ఈరన్న కుటుంబంలో తీవ్ర వివాదానికి దారి తీసింది. ఈ విషయంపై గతంలోనే పోల?సస్టేషన్‌లో కేసు నమోదైంది. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది 2026 జూలై 26న చిన్న ఈరన్న ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త మృతికి నరసమ్మ కారణమంటూ అతని భార్య శిరీష కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నారు. ఆమెను అంతమొందించాలని పథకం వేశారు.

-తెల్లవారుజామున పథకం ప్రకారం దాడి..

పథకం ప్రకారం ఈనెల 6వ తేదీన తెల్లవారుజామున ఆదోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా మున్సిపల్ విధులు నిర్వహిస్తున్న నరసమ్మపై దాడి చేశారు. ముందుగా కళ్లలో కారం చల్లి, ఆపై వాటర్ బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పటించి పరారయ్యారు. మంటల్లో చిక్కుకుని కేకలు వేసిన నరసమ్మను తోటి కార్మికులు కాపాడి ఆసుపత్రికి తరలించారు. 80శాతం కాలిన గాయాలతో ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా టూటౌన్ పోలీసులు క్రైమ్ నం.170/2026 కింద కేసు నమోదు చేశారు. అమరావతి రోడ్డు, బసాపురం జంక్షన్ సమీపంలో పారిపోతుండగా ఆరుగురు నిందితులు శిరీష, రాములమ్మ, సుజాత, ఐసీ ఈరన్న, హేమ, అంజినమ్మను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా మృతుడు చిన్న ఈరన్న కుటుంబ సభ్యులేనని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి సగం పెట్రోల్ ఉన్న వాటర్ బాటిల్, ప్లాస్టిక్ మగ్, కాలిన దుస్తుల అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటరమణ, సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

# గంజాయి కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్ష

-ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా



ఏలూరు సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం:

గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి పది సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ ఏలూరు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఇందిరా ప్రియ దర్శిని సోమవారం సాయంత్రం తీర్పు చెప్పారని జిల్లా ఎస్పీ కిషోర్ వెల్లడించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో సోమవారం రాత్రి కేసు వివరాలను వెల్లడించారు. విశాఖపట్టణం జిల్లా కసింకోట మండలం సింగవరం గ్రామానికి చెందిన ఉసిరిక బసవరాజు (34), ఉసిరక అప్పారావు (35), చందనాడ సత్తిబాబు (40)లు కలిసి 2021 ఏప్రిల్ 23వ తేదీ సాయంత్రం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మీదుగా 1479 కేజీల గంజాయిని తీసుకువెళు తున్నారు. ఈ సమాచారం అప్పటి సీఐ ఎస్.గౌరీశంకర్, ఎస్ఐ ఆనంద్‌రెడ్డిలకు అందడంతో వారు బుట్టాయిగూడెం రోడ్డు పెట్రోల్ బంకు వద్ద తనిఖీలు నిర్వహించారు. కొయ్యలగూడెం నుంచి అశ్వరావుపేట వస్తున్న లారీని తనిఖీలు చేయగా బసవరాజు, సత్తిబాబు, అప్పారావులు పట్టుబడ్డారు. వారినుంచి 1,479 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని కొనుగోలు చేసినట్లుగా గుర్తించిన వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన బోనగాని బిక్షపతి (54)ని కూడా అరెస్టు చేశారు. తరువాత అప్పటి సీఐ బాలసురేష్ దర్యాప్తు నిర్వహించారు. ఈ కేసు ఏలూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. కోర్టు మానిటరింగ్‌సెల్ సిబ్బంది సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో నలుగురికి పది సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా చొప్పున విధిస్తూ ప్రియదర్శిని తీర్పు చెప్పారు.

# అక్రమాలు అవాస్తవం-నిబంధనల ప్రకారమే స్పోర్ట్స్ కోటా

-పారదర్శకంగా మెగా డీఎస్సీ నియామకాలు

-కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అధికారిక సంస్థలిచ్చిన పత్రాలే పరిగణనలోకి

-ఫిర్యాదులుంటే విచారణ జరుపుతాం

-స్కూళ్లకెళ్లి టీచర్లను అవమానించొద్దు

-అలా చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు

-విద్యా శాఖ కమిషనర్, శాప్ ఎండీ హెచ్చరిక

-ఆరోపణలపై కేస్ స్టడీస్ వివరాలు వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

మెగా డీఎస్సీ-2025లో స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల టెట్ అర్హతలు, క్రీడా సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణపై వివిధ మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, శాప్ వైస్ చైర్మన్/ఎండీ భరణి స్పష్టం చేశారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందిన టీచర్ల అర్హతలపై ఎవరైనా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతామని, ఇందుకోసం రాష్ట్ర విద్యా శాఖలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతేకానీ ఎవరైనా నేరుగా పాఠశాలలకు వెళ్లి టీచర్ల గురించి అవమానకరంగా మాట్లాడితే కేసులు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. డీఎస్సీ నిర్వహణలో తీసుకున్న జాగ్రత్తలు, పాటించిన నిబంధనలను తెలియజేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు అభ్యర్థుల గురించి తమ విచారణలో వెల్లడైన కేస్ స్టడీస్‌ను వివరించారు.

-పారదర్శకంగా ప్రక్రియ: అన్సారియా

మెగా డీఎస్సీ-2025లో టీచర్ ఉద్యోగం పొందిన అభ్యర్థుల టెట్, విద్యార్హతలు, కేటగిరీలు, రిజర్వేషన్లు, క్రీడా అర్హత సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలించామని విద్యా శాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా చెప్పారు. అభ్యర్థులు పొందుపర్చిన ఏవైనా సర్టిఫికెట్లు నకిలీవని లేదా అర్హతలకు విరుద్ధమని నిర్ధారణ అయితే చట్టపరంగా తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కేవలం ఆరోపణల ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రతి కేసును అధికారికంగా తగిన ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని తెలిపారు. టీచర్ల నియామక ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల మేరకే జరిగినట్లు స్పష్టం చేశారు. పారదర్శకత, నిబంధనల అమలు, అధికారిక ఆధారాల పరిశీలనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చిందని వివరించారు.రికార్డుల ప్రకారమే క్రీడా కోటా: భరణి క్రీడా కోటా అభ్యర్థులపై వచ్చిన ఆరోపణలపై శాప్ వైస్ చైర్మన్/ఎండీ భరణి వివరణ ఇస్తూ.. స్పోర్ట్స్ కోటాకు సంబంధించి 2025 ఆగస్టు 8 నుంచి 14 వరకు తాత్కాలిక జాబితాను ప్రచురించి గ్రీవెన్స్‌కు అవకాశం కల్పించామని చెప్పారు. వీటిపై తర్వాత వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలించామన్నారు. స్పోర్ట్స్ కోటాపై హైకోర్టులో 69 రాతపూర్వక పిటిషన్లు దాఖలయ్యాయని, ఏపీ స్టేట్ జూడో అసోసియేషన్ జారీ చేసిన సర్టిఫికెట్ల ప్రామాణికతపై కోర్టులో పిల్ నంబర్ 170 ద్వారా పరిశీలనలో ఉందని తెలిపారు. 2017 నుంచి విజిలెన్స్‌కు ఫిర్యాదులు అందినట్లు పిల్‌లో పేర్కొన్నారని తెలిపారు. విజిలెన్స్ విచారణ నివేదికను సమర్పించాలని కోర్టు ఆదేశించిందని, అందువల్ల ఈ అంశంపై తుది నిర్ణయం కోర్టు తీర్పు ప్రకారమే ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రీడా కోటాలో క్రీడాకారులకు అధికారిక సంస్థలు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు సంబంధించి జాతీయ ఫెడరేషన్లు లేదా రాష్ట్ర అసోసియేషన్లు, ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు సంబంధిత వర్సిటీలు, స్కూల్ గేమ్స్‌కు విద్యా/క్రీడా అధికారి, కేలో ఇండియా గేమ్స్‌కు స్పోర్ట్స్ అథారిటీకి ధ్రువీకరణలు జారీ చేసే అధికారం ఉందని తెలిపారు. ఆ ప్రకారమే సర్టిఫికెట్లను టీచర్ల నియామక ప్రక్రియలో పరిశీలిస్తారని వివరించారు. ఒకే మండలానికి చెందిన ఏడుగురు క్రీడాకారుల జూడో సర్టిఫికెట్లపై ఆరోపణలు వచ్చాయని,




వాటిపై విజిలెన్స్ విచారణ సాగుతోందని తెలిపారు. విచారణలో తప్పు జరిగి నట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని స్ప ష్టం చేశారు. అలాగే ఒక క్రీడాకారుడు తన సొంత జిల్లాలో తప్పనిసరిగా పోటీలో పాల్గొనాలనే నిబంధన లేదని ఏపీ జూడో అసోసియేషన్ స్పష్టం చేసిందని చెప్పారు. క్రీడాకారులు తాము చదువుతున్న, పనిచే స్తున్న జిల్లాకు ప్రాతినిధ్యం వహించవచ్చని అసోసి యేషన్ తేల్చిందని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన అభ్యర్థుల కేస్ స్టడీస్‌ను ఆమె వివరించారు.

-స్పోర్ట్స్ కోటాపై సందేహాలు.. వాస్తవాలు

-క్రీడా కోటాలో ఎంపికైన భార్యాభర్తలు

నొస్సం కరిష్మా, షేక్ ఇమామ్ హుస్సేన్.. భార్యాభర్తలు. వీరిద్దరూ టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. వీరి జూడో సర్టిఫికెట్ల ప్రామాణికతపై సందేహాలున్నాయని ఆరోపణలు వచ్చాయి. వీరిద్దరూ 2014 నవంబరు 11-13న విజయవాడలో జరిగిన సీనియర్ అంతర్ జిల్లా జూడో టోర్నమెంట్‌లో రెండో స్థానం సాధించినట్లు రికార్డుల్లో ఉంది. మహిళలు, పురుషుల విభాగాల్లో వేర్వేరు బరువు కేటగిరీల్లో పాల్గొన్నందున వారి క్రీడా ప్రతిభను వేర్వేరుగా పరిగణించారు. క్రీడా పోటీల్లో పాల్గొనడానికి విద్యా సంస్థల్లో తప్పనిసరిగా నమోదై ఉండాలన్న నిబంధన ఏమీ లేదు. 2014లో షేక్ ఇమామ్ హుస్సేన్ కర్ణాటకలో బీఈడీ చదువుతున్నా.. తన స్వస్థలం ఆధారంగా కర్నూలు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ ఏపీ తరఫున పోటీల్లో పాల్గొన్నారు.

-సర్టిఫికెట్ అప్‌లోడ్‌పై వివాదం

పెద్ది అప్పలరాజు అనే క్రీడా కోటా అభ్యర్థి బాక్సింగ్ సర్టిఫికెట్‌పై వివాదం ఏర్పడింది. అప్పలరాజు మొదట తప్పుగా తన సోదరుడి క్రీడా సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని ఆరోపణ. అయితే ఎన్ని పత్రాలు అప్‌లోడ్ చేసినా దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకునే అవకాశం తుది దశలో ఉంది. అభ్యర్థి నేషనల్ చాంపియన్‌షిప్ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేశారు. ఫిజికల్ వెరిఫికేషన్‌లో కూడా అదే సర్టిఫికెట్ సమర్పించారు. 2023లో గోవాలో జరిగిన 37వ నేషనల్ గేమ్స్ రికార్డుల్లో 'పాండా'గా పేరు నమోదైంది. అసలు సర్టిఫికెట్‌లో అభ్యర్థి పేరు పెద్ది అప్పలరాజుగానే ఉంది.

-రికార్డుల ప్రకారం పరిగణనలోకి

శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొనడ పద్మజ 2021లో ఏపీ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానం సాధించిన విషయంలో ఆమె వయస్సు, గత క్రీడా రికార్డులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. రికార్డులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ సమర్పించిన ఫామ్-2 ఆధారంగా ఆమె క్రీడా విజయాన్ని చెల్లుబాటుగా పరిగణించారు. 2025 ఏప్రిల్ 19న జారీ చేసిన జీవో 4లోని నిబంధనల ప్రకారం ఆమెను ఎంపిక చేశారు.

-సాఫ్ట్‌బాల్ సర్టిఫికెట్లపై స్పష్టత

శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి సాఫ్ట్‌బాల్ సర్టిఫికెట పైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఫామ్-2కు సంబంధించి అసోసియేషన్ అధ్యక్షుడు జారీ చేయగలరా? అని సందేహాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా.. శాప్ ఎండీకి పంపిన లేఖలో క్రీడా కారుల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ తరఫున అధ్యక్షుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు స్పోర్ట్స్ సర్టిఫికెట్ల పరిశీలనకు అధికారం ఇచ్చారు. ఆ అసోసియేషన్‌ను 2026లో శాప్ గుర్తించింది.

-ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్

ఓసీ-ఈడబ్ల్యూఎస్ కేటగిరీపై ఆరోపణలు ఎదురైనప్పుడు.. ఈ కేటగిరీ అభ్యర్థుల విషయంలో తహశీల్దార్ ఇచ్చిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఆధారంగా నియామకం చేపట్టారు. వ్యక్తిగత ప్రకటనలు కాకుండా అధీకృత అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలన్న నిబంధన ఉంది.

-టెట్ ఉన్నా లేదని దుష్ప్రచారం

టెట్ అర్హత లేకుండానే డీఎస్సీలో ఉద్యోగాలు ఇచ్చారంటూ సాక్షి పత్రిక చేసిన దుష్ప్రచారాన్ని ప్రభుత్వం తిప్పికొట్టింది. పలు ఆరోపణలకు వివరణ ఇచ్చింది. జంపాల ఉష అనే అభ్యర్థి డీఎస్సీలో ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు టెట్ లేదనేది ఆరోపణ. బీసీ-ఏ కేటగిరీకి చెందిన ఆమె 2012లో 79 మార్కులు, అదే ఏడాది మరో టెట్‌లో 80 మార్కులు, 2017లో 76 మార్కులతో 2-ఏ పేపర్లలో టెట్ అర్హత సాధించారు. ఆ తర్వాత గణితం సైన్స్‌లో 2-ఏ పేపర్‌లో మరో రెండుసార్లు అర్హత సాధించారు. 2011 నుంచి 2017 వరకు భాషా సబ్జెక్టులకు ప్రత్యేకంగా టెట్ లేదు. 2-ఏ పేపర్లలో ఏదైనా అర్హత సాధిస్తే సరిపోతుంది. అదే విధానంలో 2012, 2017లో ఉన్న టెట్ అర్హతల ఆధారంగా ఉద్యోగానికి ఎంపిక చేశారు. ఓసీ కేటగిరీకి చెందిన గాయత్రిశ్రీ మిరియాల డీఎస్సీ క్రీడా కోటాలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) ఉద్యోగం సాధించారు. ఆమె 2024లో టెట్ రాసి 97.89 మార్కులు సాధించారు. నిబంధనల ప్రకారం ఓసీలు 90 మార్కులు సాధించాలి. ఆమె అంతకంటే ఎక్కువ మార్కులే తెచ్చుకున్నా టెట్ లేకుండా ఉద్యోగం ఇచ్చారని ప్రచారం చేస్తున్నారు. ప్రగడ కల్యాణి అనే బీసీ-ఏ కేటగిరీ అభ్యర్థి క్రీడా కోటాలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉద్యోగం సాధించారు. 2018లో 75 మార్కులతో టెట్ అర్హత సాధించారు. బీసీలకు అర్హత మార్కులు 75. ఆ మేరకు మార్కులతో ఆమె అర్హత సాధించినా టెట్ లేదని ఆరోపణలు చేస్తున్నారు.వి.చక్రపాణి రెడ్డి అనే ఓసీ కేటగిరీ అభ్యర్థి ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో డీఎస్సీలో ఉద్యోగం సాధించారు. చిత్తూరు జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)గా పనిచేస్తున్నారు. 2024లో టెట్ రాసి 84.7 మార్కులు సాధించారు. నిబంధనల ప్రకారం ఓసీలకు 90 మార్కులు రావాలి. అయితే ఈ అభ్యర్థికి ఎక్స్ సర్వీస్‌మెన్ రిజర్వేషన్ ఉన్నందున ఆ కేటగిరీలో 40 శాతం అంటే 60 మార్కులు సాధిస్తే సరిపోతుంది. ఈ మేరకు టెట్ అర్హత సాధించినప్పటికీ లేదని ఆరోపణలు చేస్తున్నారు.

# డిఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహరాజుకు మార్నింగ్ కాఫీ క్లబ్ సత్కారం

భీమవరం సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం;

రాష్ట్రంలోనే ఎంతో ప్రతిష్టకరమైన దంతులూరి నారాయణ రాజు (డిఎన్నార్) కళాశాల ప్రిన్సిపాల్ గా భూపతిరాజు నరసింహరాజు నియమితులు కావడం హర్షించదగ్గ విషయమని మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ & కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్,పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, అన్నారు. భీమవరం డిఎన్నార్ కళా శాల రోడ్డులోని తాడిమళ్ళ గిరి కాంప్లెక్స్ లో సోమ వారం మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన నరసింహ రాజు ను సత్కరించారు. కారుమూరి సత్యనారాయణ, కంచర్ల భాస్కరరావు, జూలూరి గోపిరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కళాశాల పిడిగా నరసింహరాజు ఎన్నో సేవల ను అందించారని, నేడు కళాశాల ప్రిన్సిపాల్ గా నిమమితులై మరెన్నో సేవలను అందించి కళాశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కనగర్ల విజయ రామకృష్ణ, కోట్ల ప్రసాద్, బంగారు రాము మాట్లాడు తూ పదవులు బాధ్యతలను మరింత పెంచు తాయని, కళాశాల ప్రగతికి పాటుపడాలన్నారు. సత్కార గ్రహీత నర సింహ రాజు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని అన్నారు. అనంతరం నరసిం హరాజు ను




సత్కరిం చారు. కార్యక్రమంలో బొడ్డు వాసు పులవర్తి రామ కృష్ణ, బొండా హను మంతరావు, కురిశెట్టి శ్రీనివాస అప్పారావు, చవ్వా భామ కృష్ణమూర్తి, కారుమూరి కిరణ్, వాకర్స్ సభ్యులు,వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

# శరవేగంగా హైవే నిర్మాణం

-చురుగ్గా సాగుతున్న విశాఖ- రాయపూర్ ఆరు లేన్ల రోడ్డు పనులు
-చిన్నయ్యపాలెం వద్ద పూర్తయిన అనకాపల్లి- ఆనందపురం హైవే అనుసంధానం
-సూరెడ్డిపాలెం వద్ద డబుల్ ట్రంపెట్ నిర్మాణం
-సబ్బవరం- షీలానగర్ రోడ్డు ఎనిమిది నెలల్లో పూర్తి

సబ్బవరం, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

విశాఖపట్నం-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను అనుసంధానం చేసే ఈ రహదారి పనులు అననకాపల్లి జిల్లా పరిధిలో దాదాపు పూర్తయ్యాయి. సిగ్నల్స్, నేమ్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు, సీసీ కెమెరాలు, రాత్రిపూట లైటింగ్ కోసం సౌర పలకలను ఏర్పాటు చేశారు. ఆరు వరుసలుగా నిర్మిస్తున్న ఈ రహదారిలో డివైడర్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిని కలుపుతూ సబ్బవరం సమీపంలో చిన్నయ్యపాలెం వద్ద ఇంటర్ చేంజ్ (ట్రంపెట్) నిర్మాణ పనులు చివరిదశకు చేరాయి. రాయపూర్ నుంచి విశాఖ నగరంలోకి వెళ్లే వాహనాలు చిన్నయ్యపాలెం ఇంటర్‌చేంజ్ నుంచి సుమారు కిలోమీటరు దూరం నుంచి అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారి మీదుగా అమృతపురం శివారు సూరెడ్డిపాలెం వరకు ప్రయాణిస్తాయి. ఇక్కడ నుంచి సబ్బవరం- షీలానగర్ సాగరమాల (పోర్టు కనెక్టవిటీ) రోడ్డు మీదుగా విశాఖకు వెళతాయి. ఇందుకోసం సూరెడ్డిపాలెం డబుల్ ట్రంపెట్ నిర్మిస్తున్నారు. మరో ఎనిమిది నెలల్లో సబ్బవరం- షీలానగర్ సాగరమాల రోడ్డు అందుబా టులోకి వస్తుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు.



-మూడు రాష్ట్రాల మీదుగా హైవే..

విశాఖ- రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే మొత్తం పొడవు 464 కిలోమీటర్లు. ఇందులో 100 కి.మీ. ఏపీలో, 240 కి.మీ. ఒడిశాలో, 124 కి.మీ. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వున్నాయి. ఏపీలో రహదారి నిర్మాణ పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. ఏపీలో పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో మినహా మిగిలిన చోట్ల రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. విశాఖ- రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం చిన్నయ్యపాలెం వద్ద ప్రారంభమై, చత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ సమీపంలో అభన్‌పూర్ వద్ద ముగుస్తుంది. చిన్నయ్యపాలేనికి ఏడు కిలోమీటర్ల దూరంలో గులివిందాడ- చీపురువలస మధ్య టోల్ ప్లాజా ఏర్పాటు చేస్తున్నారు. ఈ రహదారికి సర్వీసు రోడ్లు ఉండవు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్నపాటి గూడ్స్ వ్యాన్‌లను ఈ రోడ్డుపైకి అనుమతించరు. సబ్బవరం- షీలానగర్ సాగరమాల రోడ్డు నిర్మాణం కూడా పూర్తయితే రాయపూర్- విశాఖ మధ్య దూరం 80 కిలోమీటర్లు, ప్రయాణ సమయం ఆరు గంటల వరకు తగ్గుతుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు.

# దిగజారుతున్న భూగర్భ జలాలు

-నర్సీపట్నంలో పలుచోట్ల అడుగంటిన బోర్లు
-మరింత లోతుగా కొత్త బోర్లు వేయిస్తున్న పట్టణవాసులు
-ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఎండిపోయిన వరహా నది
-పని చేయని దుగ్గాడ వాటర్ స్కీమ్
-ప్రత్యామ్నాయంగా బోర్ల నుంచి నీరు సరఫరా

నర్సీపట్నం,సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

పట్టణంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. వెంకునాయుడుపేట, శారదానగర్‌లో బోర్లు ఎండి పోవడంతో వాటిని మరింత లోతు చేస్తున్నారు. కొంతమంది పాత బోరును మూసేసి కొత్తగా బోరు తవ్వించుకుంటున్నారు. ఎల్‌నినో ప్రభావంతో జూన్ నుంచి ఇప్పటి వరకు కనీసస్థాయిలో కూడా వర్షాలు పడక పోవడంతో ఆ ప్రభావం భూగర్భ జలాల మీద పడింది. పట్టణంలోని శారదానగర్‌లో ఈ సమస్య అధికంగా ఉంది. గతంలో 200 అడుగుల లోతున బోరు వేసే.. నీరు సమృద్ధిగా వచ్చేది. ఇప్పుడు 300 నుంచి 400 అడుగుల వరకు బోరు వేయాల్సి వస్తున్నది. బోరు తవ్వకం, కేసింగ్, మోటారు కోసం సుమారు లక్ష రూపాయల ఖర్చు చేయాల్సి వస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిండడానికి 30 నిమిషాలపాటు మోటార్ నడిస్తే సరిపోయేది. కానీ ఇప్పుడు భూగర్భ జలాలు బాగా పడిపోవడంతో ట్యాంకు నిండడానికి గంటకుపైగా సమయం పడుతున్నది.



-వరహా నది వెలవెల

బలిఘట్టం మీదుగా ప్రవహిస్తున్న వరహా నదిలో నీరు లేదు. చుట్టు పక్కల చెరువుల్లో నీరు లేదు. మరోవైపు వర్షాలు పడకపోగా వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. దీంతో భూగర్భ జలాల నానాటికీ దిగజారిపోతున్నాయి. వరహా నదిలో నీరు లేక పోవడంతో పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే పథకాల్లో ఒకటైన దుగ్గాడలోని మంచినీటి పథకం పనిచేయడం లేదు. ప్రజలు ఇబ్బంది పడకుండా వుండేందుకు మునిసిపల్ అధికారులు దుగ్గాడలో నాలుగు, ఉత్తరవాహిని వద్ద ఐదు బోర్లు నుంచి మోటార్లతో నీటిని తోడి పట్టణవాసులకు సరఫరా చేస్తున్నారు. వారం రోజుల క్రితం వరకు కొళాయిల ద్వారా రోజు తాగునీరు సరఫరా అయ్యేంది. ప్రస్తుతం రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నారు. గతంలో ఎప్పుడైనా దుగ్గాడలో నీరు లేకపోతే గొలుగొండ మండలం రావణాపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయించి మంచినీటి అవసరాలకు వాడుకునే వారు. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో రావణాపల్లి సైతం అడుగంటింది.

# ప్రమాదాలకు 'అడ్డంగా' పోతున్నారు

చిత్తూరుసెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

కొందరు ప్రమాదాలకు 'అడ్డంగా' పోతుంటే.. మరికొందరు ఎదురెళ్లుతున్నారు. జాతీయ రహదారి పై నిబంధనలను గాలికొదిలి.. ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఇలా పెరిగిన రోడ్డు ప్రమాదాలతో కొందరు మృతిచెందితే.. మరికొందరు అంగవైకల్యంతో బాధపడుతున్నారు. తమ కుటుంబాలకు శోకాన్ని.. కష్టాన్ని మిగులుస్తున్నారు. జిల్లాలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి తదితర నగరాలకు వెళ్లే జాతీయ రహదారులున్నాయి. వీటిలో రోజూ వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. మరోవైపు ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం, అర్ధగిరి తదితర ప్రాంతాలకు భక్తులు కూడా ఈ జాతీయ రహదారులపై వెళుతుంటారు. ఇలా నిత్యం రద్దీగా ఉండే ఈ జాతీయ రహదారుల్లో పలుచోట్ల నిబంధనలు ఉల్లంఘిస్తూ చాలా మంది వాహనదారులు, పాదచారులు కోరి మరణాలు తెచ్చుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘించి సర్వీస్ రోడ్లనుంచి జాతీయ రహదారులను కలుపూతూ బండలు.. సిమెంటుతోనూ రోడ్లు వేశారు. దగ్గరగా గమ్యస్థానాలకు వెళ్లొచ్చని స్థానిక వాహనదారులు, పాదచారులు వీటిపై దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇది తరచూ జాతీయ రహదారుల్లో జరుగుతున్న ప్రమాదాలకు నిదర్శనం. మరోవైపు కొంతమంది తమ వ్యాపారాల కోసం సర?్వసరోడ్లపైకి వచ్చేస్తున్నారు. కొన్ని చోట్ల సూచిక బోర్డులు లేకపోవడం, బస్‌స్ట?పలపై సరైన పర్యవేక్షణ లేదు. ఇవన్నీ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు సంబంధిత అధికారులు హడావిడి చేసి.. తర్వాత పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి.



-ఈ 25 ప్రాంతాలు అత్యంత ప్రమాదకరం

జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న 25 బ్లాక్ స్పాట్‌లను అధికారులు గుర్తించారు. ఎన్‌హెచ్ 69: ఎంసీఆర్, చీలాపల్లి క్రాస్, గంగాసాగరం ఆర్ఎంఎం ఫ్యాక్టరీ, యాదమరి జంక్షన్, వరిగపల్ల జంక్షన్, కేజీ సత్రం, మొగిలి ఘాట్ రోడ్డు, దొరచెరువు, జగమర్ల క్రాస్, దండపల్లి (వైఎ?సఆర్) జంక్షన్, పొన్న మాకులపల్లె క్రాస్, కుక్కల దొడ్డి క్రాస్. ఎన్‌హెచ్ 42: గొల్లపల్లి క్రాస్, దేవదొడ్డి, కొమ్మరమడుగు క్రాస్, జవునిపల్లి క్రాస్, నాయనపల్లి పెట్రోల్ బంక్ (గుడిసెట్టపల్లి), విజలాపురం క్రాస్, కే.సి హాస్పిటల్. ఎన్‌హెచ్ 40: మురుకంబట్టు జంక్షన్ ఎన్‌హెచ్ 140: తెల్లగుండ్లపల్లె (లక్ష్మీగణపతి డాబా దగ్గర), పి.కొత్తకోట రైల్వే అండర్ బ్రిడ్జి ఎన్‌హెచ్ 716: నగరి హెచ్‌పీ పెట్రోల్‌బంక్, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, కన్నం మిట్ట.

-రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఇటీవల రవాణాశాఖ, నేషనల్ హైవేస్, ఆర్అండ్‌బీ, పోలీసు, ఆర్టీసీ, ఇతర అధికారులతో కలసి జిల్లాలోని బ్లాక్ స్పాట్‌లపై అధ్యయనం చేశాం. నేషనల్ హైవే వారికి తగిన సూచనలు చేశాం. గ్రామాలున్న ప్రాంతాల్లో ఎన్‌హెచ్ రోడ్లు, సర్వీస్ రోడ్ల మధ్య ప్రజలు, జంతువులు రోడ్డు దాటే వీల్లేకుండా ఇనుప డివైడర్లు ఏర్పాటు చేయాలి. కొన్ని ఆర్టీసీ.. ట్రావెల్స్ బస్సులు, ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలు ఎన్‌హెచ్‌లపై ఉన్న కనెక్టివిటీ రోడ్లపైన ప్రయాణికులను దించుతున్నారు. దీనివల్ల ప్రయాణికులు రోడ్డుపై వచ్చే వాహనాలను గమనించక రోడ్డుదాటుతూ ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరోవైపు ఈ వాహనాలను ఆపడంతో.. వెనుక వస్తున్న వాహనదారులు ఢీకొంటున్నారు. సర్వీస్ రోడ్డులో వెళ్లి బస్‌స్ట?పలోనే ఆపి ప్రయాణికులను దించాలి. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదికలు ఇచ్చాం.

# అనాథలుగా మిగిలిన చిన్నారులు

-గుండెపోటుతో తండ్రి మృతి
-గతేడాది మృతిచెందిన తల్లి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం



పట్టణంలోని పాలసాగరం కాలనీకి చెందిన అబ్దుల్లా(37) సోమవారం గుండెపోటు తో మృతిచెందాడు. వివరాల మేరకు.. అబ్దుల్లా, నసీమూన్‌కు తస్లిం(10), సోఫియా(9) అను ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు కూలిపనులకు వెళ్లి తమ పిల్లలను పెంచుకుంటు చదివించుకొంటున్నారు. గతేఏడాది తల్లి నసీమూన్ అనారోగ్యంతో మృతి చెందిం ది. అప్పటి నుంచి అన్నీ తానై వారిని పెం చాడు. అయితే సోమవారం తండ్రి మృతిచెందడంతో ఇద్దరు కుమార్తెలు అనాథలుగా మిగిలారు. తండ్రి మృతదేహం వద్ద ఇద్దరు చిన్నారుల రోదనలు కంటతడి పెట్టించాయి. బంధువులు ఎవరూ లేకపోవడంతో కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. దాతలు పిల్లలను ఆదుకోవాలని కోరుతున్నారు.

# కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

-అప్లికేషన్లు అందిస్తున్న అర్హులు
-తొలిరోజు వెంటాడిన సర్వర్ సమస్య
-క్షేత్రస్థాయిలో రాజకీయ నాయకుల హడావుడి



పార్వతీపురం,సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు సోమవారం తొలిరోజు జిల్లాలోని పలు ప్రాంతా ల్లోని వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు స్వర్ణ గ్రామ , వార్డు సచివాల యాలకు చేరుకుని దరఖాస్తులు అందించారు. ఆధార్, రైస్ కార్డు, ఆదాయ, సదరం, కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ నెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ, 17 నుంచి 21 వరకు పరిశీలన, 22 నుంచి 24 వరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషననర్ల పరిశీలన, 25, 26 తేదీల్లో నూతన పింఛన్లకు నిధులు ప్రతిపాదన ఉంటుంది. సెర్ప్ సీఈవో, సోషల్ వెల్ఫేర్, తదితర శాఖల అధికారుల పర్యవేక్షణలో పింఛన్ల మంజూరు ఉంటుంది. స్థానిక ఎన్నికల కోడ్ రాకముందే ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. అర్హులకు దశలవారీగా పింఛన్లు అందిం చనున్నారు.

-మొదటిరోజు సర్వర్ ఇబ్బందులు...

సామాజిక పింఛన్లు మంజూరు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవడంతో తొలిరోజు జిల్లాలో పలుచోట్ల సర్వర్ సమస్య తలెత్తింది. దీంతో ఆన్‌లైన్ ప్రక్రియ ఇబ్బందిగా మారింది. సాలూరులో 6, 7 స్వర్ణవార్డు సచివాలయాలకు 12 దరఖాస్తులు రాగా అందులో మూడు మాత్రమే ఆన్‌లైన్ అయ్యాయి. కురుపాం 1,2 సచివాలయాలకు 40 దరఖాస్తులు రాగా.. 20 వరకు ఆన్‌లైన్ అయినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. కాగా దరఖాస్తుల స్వీకరణకు వారం రోజులే గడువు ఉండడంతో మరోవైపు అర్హులు పెద్దఎత్తున సచివాలయాలకు తరలివస్తున్నారు. సుమారు మూడేళ్లగా పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు ఎంతో ఉత్సాహంగా కదిలారు. పాచిపెంటలోని స్వర్ణ గ్రామ 1,2 సచివాలయాలకు మొదటిరోజే 42 దరఖాస్తులు వచ్చాయి. అందులో 16 వితంతు , 22 వృద్ధాప్య పింఛన్లు కోసం దరఖాస్తులు వచ్చాయి. మరోవైపు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రాజకీయ పార్టీ నాయకులు హడావుడి మొదలైంది. త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దరఖాస్తుదారులను నేరుగా సచివాలయాలకు తీసుకెళ్తున్నారు. మరి కొందరు అర్హులతో దగ్గరుండి దరఖాస్తు చేయిస్తున్నారు. మొత్తంగా క్షేత్రస్థాయిలో ఆశావహుల సందడి కనిపిస్తుంది.

# సంకిలి కర్మాగారాన్ని కాపాడండి

-కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి

రేగిడి, సెప్టెంబరు 7 వార్త సాక్ష్యం



సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారాన్ని కాపాడాలని కోరుతూ పరిశ్రమ పరిరక్షణ కమిటీ సభ్యులు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో జేసీ ఎస్.మాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. సూపర్ ఎల్‌నినో సాకు చూపించి 2027-28 క్రషింగ్ సీజన్‌ను మూసివేస్తున్నట్టు ప్రకటిం చడంపై ఉమ్మడి జిల్లాల చెరకు రైతులు వ్యతిరేకిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. ఆయన వెంట పరిరక్షణ కమిటీ సభ్యులు చింత సంగంనాయుడు, నిష్ఠల సూర్యప్రకాష్ గుప్తా, గురాన కార్తీక్, పి.నాగశెట్టి తదితరులు ఉన్నారు. వీటిపై స్పందించిన జేసీ.. ఉమ్మడి జిల్లాల రైతులు, ప్రజాప్రతినిధుల, యాజమాన్యంతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, కర్మాగారం పది కాలలు ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

VARTHAA SAKSHAMU
వార్త
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 08 సెప్టెంబర్ 2026

# బిజినెస్

## ఏఐ ఎఫెక్ట్.. రికార్డు స్థాయికి చేరిన ప్రపంచ కుబేరుల సంపద!




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెట్టుబడులు వెల్లువెత్తడంతో ప్రపంచ కుబేరుల సంపద సరికొత్త రికార్డు సృష్టించింది. 2025 నాటికి బిలియనీర్ల మొత్తం ఆస్తి 15.1 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్త్ ఇంటెలిజెన్స్ సంస్థ 'అల్ట్రాటా' తన 'బిలియనీర్ సెన్సస్ 2026' నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య 8.2 శాతం పెరిగి 3,795కి చేరగా, వారి సంపద 12.8 శాతం మేర వృద్ధి చెందింది. గత ఐదేళ్లలో ఇదే అత్యధిక వార్షిక పెరుగుదల కావడం గమనార్హం. ముఖ్యంగా ఏఐ రంగంలో గణనీయమైన పెట్టుబడులు పెట్టిన కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరగడమే ఈ సంపద వృద్ధికి ప్రధాన కారణమని 'అల్ట్రాటా' నివేదిక స్పష్టం చేసింది. సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి టెక్నాలజీ కంపెనీల వ్యవస్థాపకులు, ప్రధాన వాటాదారులు అత్యధికంగా లాభపడ్డారు. ఈ నివేదిక ప్రకారం, సంపద కేంద్రీకరణ కూడా తీవ్రస్థాయిలో ఉంది. 50 బిలియన్ డాలర్లకు పైగా ఆస్తి ఉన్న 29 మంది 'సూపర్ బిలియనీర్ల' చేతిలోనే 4.1 ట్రిలియన్ డాలర్ల సంపద కేంద్రీకృతమై ఉంది. ఇది మొత్తం బిలియనీర్ల ఆస్తిలో దాదాపు 27 శాతానికి సమానం. ప్రాంతాల వారీగా చూస్తే, 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత యూరప్ (1,081), ఆసియా (881) ఉన్నాయి. అయితే, ఈ సంపదలో అధిక భాగం స్టాక్ మార్కెట్ విలువలతో ముడిపడి ఉన్నందున, 'ఏఐ'పై సెంటిమెంట్ మారితే ఇందులో హెచ్చుతగ్గులు ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే దశాబ్దంలో సుమారు 6.6 ట్రిలియన్ డాలర్ల సంపద దాదాపు 5,000 మంది వారసులకు బదిలీ అవుతుందని కూడా అల్ట్రాటా అంచనా వేసింది

## కొత్త హంగులతో 2026 మారుతి బాలెనో సెగ్మెంట్‌లో తొలిసారిగా ఏడీఏఎస్ సేఫ్టీ.. ధర తక్కువే!




భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లలో ఒకటైన మారుతి సుజుకి బాలెనో, సరికొత్త హంగులతో 2026 ఫేస్‌లిఫ్ట్ మోడల్‌గా మార్కెట్లోకి వచ్చేసింది. ఆకర్షణీయమైన డిజైన్ మార్పులు, అత్యాధునిక సేఫ్టీ ఫీచర్లు, మెరుగైన మైలేజ్‌తో విడుదలైన ఈ కారు ప్రారంభ ధరను రూ. 6.09 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఉన్న నెక్సా షోరూమ్‌లలో రూ. 11,000 చెల్లించి ఈ కొత్త బాలెనోను బుక్ చేసుకోవచ్చు. డిజైన్, ఫీచర్లలో కీలక మార్పులు ఈ కొత్త బాలెనోలో ప్రధానంగా ముందు భాగంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రీడిజైన్ చేసిన వైడర్ నెక్స్‌వేవ్ గ్రిల్, కొత్త బంపర్, క్రోమ్ ఫినిషింగ్‌తో కూడిన ఫెండర్ గార్నిష్, కొత్త ˜ాజుణ ణ˜ాం కారుకు తాజా లుక్‌ను అందిస్తున్నాయి. ఎనిగ్మాటిక్ టీల్ అనే కొత్త రంగుతో సహా మొత్తం ఏడు రంగుల్లో ఇది అందుబాటులో ఉంటుంది. లోపలి భాగంలో డ్యూయల్-టోన్ క్యాబిన్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 9-అంగుళాల స్మార్ట్‌ప్లే ప్రో టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ (వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే), ప్రీమియం క్లారియన్ సౌండ్ సిస్టమ్, 360-డిగ్రీ కెమెరా, హెడ్-అప్ డిస్‌ప్లే వంటి ఫీచర్లను జోడించారు. భద్రతకు పెద్దపీట.. లెవెల్ 2 ఈ కొత్త బాలెనోలో భద్రతకు కంపెనీ పెద్దపీట వేసింది. ఈ సెగ్మెంట్‌లో తొలిసారిగా లెవెల్ 2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ ను పరిచయం చేసింది. ఇందులో భాగంగా అడ్వాన్స్‌డ్ ఎమర్జెన్సీ బ్రేకింగ్, లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి అత్యాధునిక భద్రతా ఫీచర్లు ఉన్నాయి. దీనికితోడు, భారత్ ఎన్‌క్యాప్ టెస్టులో 4-స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించడం విశేషం. టాప్ వేరియంట్లలో 6 ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ హిల్-హోల్డ్ కంట్రోల్ వంటివి స్టాండర్డ్‌గా వస్తున్నాయి. కొత్త ఇంజిన్.. పెరిగిన మైలేజ్ పనితీరు విషయంలోనూ బాలెనో అప్‌గ్రేడ్ అయింది. పాత 4-సిలిండర్ ఇంజిన్ స్థానంలో కొత్త 1.2-లీటర్ ˛12 3-సిలిండర్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 83 పవర్, 112.4 టీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5-స్పీడ్ మ్యాన్యువల్, ఆటో గేర్ షిఫ్ట్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లతో ఇది లభిస్తుంది. ఈ కొత్త ఇంజిన్ వల్ల మైలేజ్ గణనీయంగా మెరుగుపడింది. మ్యాన్యువల్ వేరియంట్‌పై 23.80 కి.మీ/లీ వేరియంట్‌పై 24.77 కి.మీ/లీ మైలేజ్‌ను కంపెనీ క్లెయిమ్ చేస్తోంది. వేరియంట్ మైలేజ్ కూడా 33.61 కి.మీ/కేజీకి పెరిగి ంది. మొత్తంమీద అత్యాధునిక టెక్నాలజీ, మెరుగైన మైలే జ్, రిఫ్రెష్ స్టైలింగ్‌తో హ్యుందాయ్ ఐ20, టాటా ఆల్ట్రోజ్ వంటి ప్రత్యర్థులకు గట్టిపోటీ ఇచ్చేందుకు బాలెనో సిద్ధమైంది. వేరియంట్ల వారీగా ధరలు, ఆన్-రోడ్ ధరల వివరాల కోసం దగ్గరలోని నెక్సా డీలర్‌షిప్‌ను లేదా అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

## పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత క్రీడా జట్లకు పచ్చజెండా..!



భారత్, పాకిస్థాన్ మధ్య క్రీడా సంబంధాల పునరుద్ధరణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ విరామం తర్వాత పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత క్రీడా బృందాలకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అనుమతించినట్లు వార్తలు వెలువడ్డాయి. 2027లో పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న సౌత్ ఏషియన్ ఫెడరేషన్ (శాఫ్) గేమ్స్‌లో భారత క్రీడాకారులు పాల్గొంటారని పాకిస్థాన్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిందని, దీంతో భారత బృందం పాకిస్థాన్‌కు వెళ్లనుందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలు నిజమైతే, పహల్గాం దాడి తర్వాత భారత క్రీడాకారులు పాకిస్థాన్ గడ్డపై అడుగుపెట్టడం ఇదే తొలిసారి అవుతుంది. గతంలో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాల కారణంగా ఇరు దేశాల మధ్య క్రీడా కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. భారత క్రికెట్ జట్టు చివరిసారిగా 2008లో పాకిస్థాన్‌లో పర్యటించగా, హాకీ జట్టు 2006లో ఆ దేశానికి వెళ్లింది. కాగా, 2027 శాఫ్ గేమ్స్‌లో క్రికెట్, హాకీతో పాటు మొత్తం 28 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భారత జట్ల పర్యటన వార్త క్రీడా వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, దీనిపై భారత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## ఆ ముగ్గురిని తప్ప అందరినీ మార్చేయండి.. పాక్ జట్టుపై షోయబ్ అక్తర్ ఘాటు వ్యాఖ్యలు



పాకిస్థాన్ క్రికెట్ జట్టులో జరుగుతున్న భారీ మార్పులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో, ఆ దేశ మాజీ ఫాస్ట్ బౌలర్, రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ మద్దతుగా నిలిచాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్ మధ్యలో ఏకంగా ఏడుగురు కొత్త ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవడం గందరగోళం కాదని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చేస్తున్న ప్రణాళికాబద్ధమైన ప్రక్షాళన అని అభిప్రాయపడ్డాడు. ఈ క్రమంలో కెప్టెన్ బాబర్ అజామ్‌ను కూడా దీర్ఘకాలిక ప్రణాళికల నుంచి తప్పించాలని పరోక్షంగా సూచించాడు.ఇంగ్లండ్‌తో మూడో టెస్టుకు ముందు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) జట్టులో భారీ మార్పులు చేయడంపై క్రీడా వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. పీసీబీకి స్థిరమైన విధానం లేదని పలువురు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో 'అవుట్‌సైడ్ ఎడ్జ్ షో'లో మాట్లాడిన అక్తర్, పీసీబీ చర్యలను సమర్థించాడు. "ప్రస్తుత జట్టుపై పీసీబీ తీవ్ర నిరాశతో ఉంది. అందుకే ఈ మార్పులు చూసి నేను ఆశ్చర్యపోలేదు. ఇది సరైన చర్య. కేవలం పాకిస్థాన్ కోసం ఆడాలనే తపన ఉన్న యువ ఆటగాళ్లతో కొత్త జట్టును నిర్మించాలని బోర్డు చూస్తోంది" అని వివరించాడు. ఈ ప్రక్షాళనలో కేవలం ముగ్గురు ఆటగాళ్లను మాత్రమే కాపాడాలని అక్తర్ స్పష్టం చేశాడు. ఫాస్ట్ బౌలర్లు షహీన్ అఫ్రిది, నసీమ్ షా, హరీస్ రవూఫ్‌లను మాత్రమే దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా కొనసాగించాలని సూచించాడు. అయితే, ప్రస్తుత కెప్టెన్ బాబర్ అజామ్ పేరును అక్తర్ ప్రస్తావించకపోవడం గమనార్హం. రెండో టెస్ట్ ఓటమి తర్వాత తాను ఒక పీసీబీ అధికారితో మాట్లాడినట్లు అక్తర్ వెల్లడించాడు. కొత్తగా వస్తున్న ఆటగాళ్ల నుంచి ఏం ఆశిస్తున్నారని అడగ్గా, "వాళ్ల నుంచి ఏమీ ఆశించడం లేదు. మేం భవిష్యత్ తరం ఆటగాళ్లపై దృష్టి పెట్టాం. పాకిస్థాన్ క్రికెట్ ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉంది. ఈ పునర్నిర్మాణ ప్రక్రియకు కనీసం రెండేళ్లు పడుతుంది" అని ఆ అధికారి చెప్పినట్లు అక్తర్ పేర్కొన్నాడు. ఇంగ్లండ్‌తో వరుస ఓటములపై స్పందిస్తూ, "మా జట్టులో పోరాట స్ఫూర్తి కొరవడింది" అని అక్తర్ వ్యాఖ్యానించాడు.

# స్పోర్ట్స్

## దులీప్ ట్రోఫీ ఫైనల్: ఇషాన్ కిషన్ విశ్వరూపం.. ఈస్ట్ జోన్ 708 పరుగుల భారీ స్కోరు



చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ (270) రికార్డు డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. అతనికి కుమార్ కుశాగ్ర (101) శతకంతో జత కలవడంతో, ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. దీంతో సౌత్ జోన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ విజయం దిశగా పటిష్ఠమైన పునాది వేసుకుంది.ఓవర్‌నైట్ స్కోరు 385/4తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఈస్ట్ జోన్, ఆరంభం నుంచే పరుగుల వరద పారించింది. వికెట్ల కోసం తీవ్రంగా ప్రయత్నించిన సౌత్ జోన్, కొత్త బంతిని తీసుకున్నా ఫలితం లేకపోయింది. పేసర్లు మహ్మద్ సిరాజ్, ఎండీ నిధీశ్ బౌలింగ్‌ను ఇషాన్ కిషన్ సమర్థంగా ఎదుర్కొని బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మరో ఎండ్‌లో కుశాగ్ర కూడా దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.లంచ్‌కు ముందు కుమార్ కుశాగ్ర తన ఆరో ఫస్ట్‌క్లాస్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం తర్వాత త్రిపురాణ విజయ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి ఫైన్ లెగ్ వద్ద ఫీల్డర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కుశాగ్ర ఔటైనా ఇషాన్ కిషన్ తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. అలసిపోయిన సౌత్ జోన్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుని, సులువుగా బౌండరీలు బాదుతూ 270 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

వార్త సాక్షం
మంగళవారం 08 సెప్టెంబర్ 2026

# వివాదాల తర్వాత మళ్లీ కలిశారు

# రవి మోహన్ సినిమాకు కెనీషా సంగీతం!



కొన్ని నెలల క్రితం వివాదాల కారణంగా సోషల్ మీడియాకు, సంగీత ప్రపంచానికి దూరమైన సంగీత దర్శకురాలు కెనీషా ఫ్రాన్సిస్ మళ్లీ రీఎంట్రీ ఇచ్చారు. రవి మోహన్ దర్శకత్వం వహిస్తున్న 'యాన్ ఆర్డినరీ మ్యాన్' చిత్రానికి ఆమె సంగీత దర్శకురాలిగా పనిచేయనున్నారు.

గతంలో వీరిద్దరి మధ్య ఉన్న సంబంధంపై తీవ్ర దుమారం రేగిన నేపథ్యంలో, ఇప్పుడు వృత్తిపరంగా వీరిద్దరూ కలిసి పనిచేస్తుండటం చర్చనీయాంశమైంది. రవి మోహన్ స్టూడియోస్ సోమవారం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. "సంగీత ప్రపంచంలోకి ఒక కొత్త స్వరం.. ఒక సరికొత్త అధ్యాయం. మీకు తెలిసిన కళాకారిణిని మీరు ఎన్నడూ వినని రీతిలో మళ్లీ పరిచయం చేస్తున్నాం. 'యాన్ ఆర్డినరీ మ్యాన్' చిత్రబృందంలోకి కెనీషాకు స్వాగతం" అని పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీనిపై కెనీషా స్పందిస్తూ.. "నాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. నా అత్యుత్తమ సంగీతాన్ని ఈ చిత్రానికి అందిస్తానని హామీ ఇస్తున్నాను" అని తెలిపారు. మే నెలలో రవి మోహన్‌తో సాన్నిహిత్యంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో, కెనీషా సోషల్ మీడియాకు దూరమవుతున్నట్లు ప్రకటించారు. తన వాదనను వినిపించే అవకాశం ఎవరూ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, సంగీతానికి, సామాజిక జీవనానికి స్వస్తి పలుకుతున్నట్లు అప్పట్లో వెల్లడించారు. "దేవుడు గెలిచే వరకు నేను ఆన్‌లైన్‌లోకి రాను. స్త్రీవాదం గెలిచింది, సంతోషం ఓడిపోయింది" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు అప్పట్లో సంచలనం సృష్టించాయి.



## నెలకి 30 లక్షల సంపాదన.. బిగ్ బాస్ కంటెస్టెంట్ ఆదాయం విని సల్మాన్ ఖాన్ షాక్!

ప్రముఖ రియాలిటీ షో 'బిగ్ బాస్' హిందీ 20వ సీజన్‌లో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ఈ షోలో కంటెస్టెంట్‌గా అడుగుపెట్టిన ప్రముఖ గేమర్, యూట్యూబర్ తన్మయ్ సింగ్ తన నెలవారీ ఆదాయ వివరాలను వెల్లడించి అందరినీ విస్మయానికి గురిచేశారు. గేమింగ్ కంటెంట్ ద్వారా తాను నెలకు రూ. 30 లక్షలు సంపాదిస్తున్నట్లు అతడు చెప్పడంతో హోస్ట్ సల్మాన్ ఖాన్ సైతం ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం ప్రసారమవుతున్న బిగ్ బాస్ 20వ సీజన్ వేదికపైకి తన్మయ్ సింగ్‌ను సల్మాన్ ఖాన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అతడి వృత్తి, ఆదాయం గురించి సల్మాన్ ఆరా తీశారు. గేమింగ్ ద్వారా నెలకు ఎంత సంపాదిస్తావని అడగ్గా, తన్మయ్ ఆ సంఖ్యను సల్మాన్ చెవిలో చెప్పారు. అది విన్న వెంటనే సల్మాన్ తీవ్ర ఆశ్చర్యానికి లోనవుతూ, "ఏంటి.. నువ్వు నెలకు 30 లక్షల రూపాయలు సంపాదిస్తున్నావా?" అని అందరి ముందు అడిగారు. దీంతో తన్మయ్ ఆదాయం వివరాలు బహిర్గతమయ్యాయి. తన సంపాదన అంతా సక్రమమైన మార్గంలో వచ్చే వైట్ మనీ అని, ఆ మొత్తాన్ని చెక్కుల రూపంలోనే అందుకుంటానని అతడు స్పష్టం చేశారు. 'స్కౌట్‌ఓపీ' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్న తన్మయ్‌కు 50 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. తన్మయ్ తన ఛానెల్‌లో గేమింగ్ వీడియోలతో పాటు వ్లాగ్స్‌ను కూడా పోస్ట్ చేస్తుంటారు. ఒక గేమర్‌కు ఈ స్థాయిలో ఆదాయం లభిస్తుందని తెలియడంతో సల్మాన్ ఖాన్‌తో పాటు ప్రేక్షకులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.



# ఓటీటీలోకి పరిణీతి చోప్రా

# ఉత్కంఠ రేపుతున్న తొలి వెబ్ సిరీస్

బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా తన కెరీర్‌లో కొత్త అడుగు వేస్తున్నారు. వెండితెరపై తన నటనతో ఆకట్టుకున్న ఆమె, ఇప్పుడు డిజిటల్ రంగంలోకి ప్రవేశిస్తున్నారు. పరిణీతి ప్రధాన పాత్రలో నటించిన తొలి వెబ్ సిరీస్ "షక్: ట్రస్ట్ నో వన్" త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ మిస్టరీ థ్రిల్లర్ సిరీస్ సెప్టెంబర్ 24 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్ కథాంశం ఎంతో ఆసక్తికరంగా ఉండనుంది. తొమ్మిదేళ్లుగా ఆచూకీ లేని తన బిడ్డ కోసం ఒక తల్లి చేసే అలుపెరగని అన్వేషణే దీని ప్రధాన ఇతివృత్తం. నమ్మకం-అనుమానం, ప్రేమ-వ్యామోహం, అంతర్ దృష్టి-నిజం మధ్య ఉండే సన్నని గీతను స్పృశిస్తూ ఈ కథ ముందుకు సాగుతుంది. భావోద్వేగాలతో కూడిన డ్రామాతో పాటు చివరి వరకు ఉత్కంఠ రేపే థ్రిల్లర్ అంశాలు ఇందులో మిళితమై ఉంటాయని తెలుస్తోంది. ఈ సిరీస్‌ను రెన్సిల్ డిసిల్వా, సిద్ధార్థ్ పి. మల్హోత్రా రూపొందించగా, రెన్సిల్ డిసిల్వానే దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆల్కెమీ ఫిల్మ్స్ పతాకంపై దీనిని నిర్మించారు. పరిణీతితో పాటు సోనీ రజ్దాన్, అనుప్ సోనీ, జెన్నిఫర్ వింగెట్, తాహిర్ రాజ్ భాసిన్, హర్లీన్ సేథి, ధ్రువ్ చౌదరి, సుమీత్ వ్యాస్ వంటి భారీ తారాగణం ఈ సిరీస్‌లో కీలక పాత్రలు పోషిస్తోంది. ఈ సిరీస్ ఎంతో వేగవంతమైన కథనంతో, ఊహించని మలుపులతో ప్రేక్షకులను కట్టిపడేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. కథలో వెల్లడయ్యే ప్రతి నిజం, మరిన్ని కొత్త ప్రశ్నలను రేకెత్తించి, ప్రేక్షకులలో ఆసక్తిని నిరంతరం పెంచుతుందని నెట్‌ఫ్లిక్స్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. పరిణీతి కెరీర్‌లో ఇది ఒక ప్రత్యేకమైన




ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని అంచనాలు వెలువడుతున్నాయి.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.